# యూరియా అందుబాటులో ఉంచాలి

- ఈ-పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించాలి
- కలెక్టర్ సత్యప్రసాద్
- మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లోని పీఏసీఎస్ గోదాం తనిఖీ



మెట్‌పల్లిరూరల్: పీఏసీఎస్ గోదాంలో యూరియా పంపిణీ వివరాలు అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, మార్చి 4: సహకార సంఘాలు, ఫర్టిలైజర్ దుకాణాల్లో ఈ-పాస్ యంత్రాల ద్వారానే ఎరువుల విక్రయాలు చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా బస్తాల నిల్వ, పంపిణీ విధానం, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పట్టాపాసు పుస్తకం ఆధారంగా ఎకరానికి రెండు బస్తాల చొప్పున యూరియా అమ్మకాలు చేపట్టాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎమ్మార్పీకే యూరియా అమ్మకాలు చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీవో మనోజ్‌కుమార్, డీపీవో మదన్‌మోహన్, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, ఏవో దీపిక, నాయబ్ తహసీల్దార్ రాజ్‌మహ్మద్, ఆర్ఐ ఉమేశ్, పీఏసీఎస్ సీఈవో శేఖర్ ఉన్నారు.

### నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలి

ఇబ్రహీంపట్నం/కథలాపూర్, మార్చి 4: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్, కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థలాలను మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా చోట్ల కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. బేస్‌మెంట్ లెవల్‌లో రూ. లక్ష, గోడల నిర్మాణ దశలో రూ. లక్ష, స్లాబ్ దశలో రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత రూ. లక్ష ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గృహ నిర్మాణ మేస్త్రీలు, కార్మికులు లబ్ధిదారులకు సహకరించి సకాలంలో ఇండ్లు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో వివరాలు పొందుపరిచే సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీపీవో మదన్‌మోహన్, హౌసింగ్ డీఈ ప్రసాద్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవోలు చంద్రశేఖర్, శంకర్, ఎంపీవో రాజశేఖర్, ఆర్ఐ నాగేశ్, కార్యదర్శులు మహేందర్, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కళాశాలలో వసతులు కల్పించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యదర్శి అలుగు వర్షిణికి వినతి



రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, మార్చి 4: కోరుట్ల ప్రభుత్వ మహిళ అగ్రికల్చరల్ డిగ్రీ కళాశాలలో వసతులు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల కోరారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల కార్యదర్శి అలుగు వర్షిణిని మంగళవారం ఆయన కలిసి అగ్రికల్చర్ కళాశాలలో వసతులు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఇటీవల కళాశాల విద్యార్థులు మౌలిక సదుపాయాలు కల్పించాలని, కళాశాలకు గుర్తింపు ఇవ్వాలని రహదారిపై బైఠాయించి నిరసన తెలిపిన విషయాన్ని సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. కళాశాలలో ప్రయోగశాల ఏర్పాటుతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. కళాశాలను రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అనుసంధానం చేయాలని విన్నవించారు. విశ్వవిద్యాలయ అనుసంధానంతో కళాశాలలో విద్యార్థినులకు మెరుగైన వనరులు, అధ్యాపకుల కేటాయింపు, పరిశోధన అవకాశాలు దక్కుతాయని పేర్కొన్నారు. కళాశాలకు భవనంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



ఏకిన్‌పూర్‌లో ఒకే చితిపై భార్యాభర్తల మృతదేహాలు

# మరణంలో వీడని బంధం

- ఒకే చితిపై భార్యాభర్తల అంత్యక్రియలు
- కోరుట్ల పట్టణం ఏకిన్‌పూర్‌లో విషాదం

కోరుట్ల రూరల్, మార్చి 4 : మరణంలోనూ వారి బంధం విడిపోలేదు. రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ భార్య సైతం పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. దీంతో భార్యాభర్తల మృతదేహాలకు ఒకే చితిపై అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపాలిటీలో విలీనమైన ఏకిన్‌పూర్‌కు చెందిన జవిడి శంకర్‌రెడ్డి(68), అనసూయ(63) దంపతులు ఈ నెల 2న ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామశివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో శంకర్‌రెడ్డి)అక్కడికక్కడే మృతి చెందగా, అతని భార్య తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స కోసం నిజామాబాద్ దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. వీరికి ముగ్గురు కూతుళ్లుండగా అందరికీ వివాహాలయ్యాయి. పెద్ద కూతురు రాజారాణి కరీంనగర్, రెండో కూతురు రజిత మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో ఉండగా, చిన్న కూతురు రోజారాణి ఆస్ట్రేలియాలో ఉంటున్నది. ప్రమాదంలో తండ్రి మృతి చెందిన వార్త తెలుసుకున్న చిన్న కూతురు రోజారాణి వస్తానని తెలపడంతో తండ్రి అంత్యక్రియలను ఆపారు. ఆమె సోమవారం ఇండియా చేరుకుని వెంటనే నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న తల్లివద్దకు వెళ్లగా, చిన్నకూతురును చివరిచూపు చూసిన కొద్దిసేపట్లోనే తల్లి మృతిచెందింది. దీంతో తల్లిదండ్రుల మృతదేహాలను ఒకే చితిపై పెట్టి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



జగిత్యాలలోని ఓ పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరీక్షల జిల్లా కన్వీనర్ నారాయణ

జగిత్యాల టౌన్/కథలాపూర్/సారంగాపూర్, మార్చి 4: జిల్లాలో బుధవారం నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ నారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 14 ప్రభుత్వ కళాశాలలు, 13 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో జనరల్ 6104 మంది, ఒకేషనల్ 969 మంది, ద్వితీయ సంవత్సరంలో జనరల్ 6395 మంది, ఒకేషనల్‌లో 982 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. రెండు ఫ్లయింగ్‌స్క్వాడ్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.40 గంటలలోపు చేరుకొని, కేటాయించిన సీట్లల్లో కూర్చోవాలని సూచించారు. విద్యార్థులు ప్రింటెడ్ మెటీరియల్‌తో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచ్‌లు, నార్మల్ వాచ్‌లు, క్యాలుక్యూలేటర్లను వెంట తీసుకురావద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెలిమానస్ 14416కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందాలన్నారు. సమస్యలు ఉంటే జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో గల కంట్రోల్ రూమ్ నంబర్ 8500470642కు ఫోన్ చేసి సూచనలు పొందాలని వివరించారు. సమావేశంలో సీనియర్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, అధ్యాపకుడు గంగాధర్ పాల్గొన్నారు.



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

# ఇప్పపెల్లిలో నీటి కష్టాలు షురూ

*కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామంలో వేసవి కాలం ఆరంభంలోనే నీటి కష్టాలు ప్రారంభమైనట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. నాలుగో వార్డులోని బోర్‌లో నీళ్లు అడుగంటిపోవడంతో గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేసినట్లు చెప్పారు.*

**-కథలాపూర్, మార్చి 4**

### చికిత్స పొందుతూ కార్యదర్శి మృతి

వెల్గటూర్, మార్చి 4: వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండీ పాషా (39) చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎండీ పాషా రెండేళ్లుగా జగదేవ్‌పేట పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజూ జగిత్యాల నుంచి విధులకు వచ్చి వెళ్తుంటాడు. కాగా, గత నెల 27న రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో పాషా తలకు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని దవాఖానకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, పాషా మృతికి పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలిపారు.

***రోడ్డు ప్రమాదంలో ఒకరి..***

జగిత్యాల రూరల్, మార్చి 4: జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ బస్టాప్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల నుంచి టీఆర్ నగర్‌కు వెళ్తున్న ట్రాలీ ఆటో, కరీంనగర్ నుంచి జగిత్యాలకు వస్తున్న ఆర్టీసీ బస్సు ధరూర్ బస్టాప్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న టీఆర్‌నగర్ చెందిన కడారి చిన్నగంగయ్య(55) మృతి చెందగా, మల్యాల శ్రీహరికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. శ్రీహరిని జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యుత్ లైన్‌మెన్ల సేవలు అభినందనీయం



కథలాపూర్: విద్యుత్ సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

జగిత్యాల/మెట్‌పల్లి రూరల్/రాయికల్/మేడిపల్లి/కథలాపూర్, మార్చి 4: నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం క్షేత్రస్థాయిలో లైన్‌మెన్లు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సాలియా నాయక్ కొనియాడారు. మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం లైన్‌మెన్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఈ మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలందించడంలో లైన్‌మెన్ల పాత్ర కీలకమని తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకు ముందు విధుల్లో ప్రాణాలు కోల్పోయిన లైన్‌మెన్లకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ గంగారాం, ఏడీఈ మనోహర్, ఎస్ఈలు రవి, అజయ్, సబ్ ఇంజినీర్లు రమేశ్, అభినయ్, స్రవంతి, వివిధ మండలాల క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. రాయికల్ పట్టణంలోని ఏఈ కార్యాలయంలో సిబ్బందిని ట్రాన్స్‌కో ఏడీఈ సింధూర్ శర్మ, ఏఈ నవీన్ శాలువాలతో సత్కరించారు. మేడిపల్లి, భీమారం మండలాల్లో లైన్‌మెన్లను ఏడీఈ బొప్పరాతి రఘుపతి శాలువాలతో సత్కరించారు. కథలాపూర్ సెక్షన్ పరిధిలోని లైన్‌మెన్లను ఇన్‌చార్జి ఏఈ నవీన్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్లు అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్, భూమేశ్వర్, గంగాధర్, కమలాకర్, జూనియర్ లైన్‌మెన్లు శ్రీకాంత్, వినోద్‌కుమార్, రాము, రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా నిల్వల పరిశీలన

కథలాపూర్, మార్చి 4: భూషణరావుపేటలోని సహకార సంఘం గోదాంలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. గోదాంలో యూరియాకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం యూరియా నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. పంటలకు సరిపడేలా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో యోగితా, సీఈవో అరుణ్‌కుమార్, ఏఈవో హరీశ్ పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ యువ పార్లమెంట్ నోడల్ జిల్లాగా జగిత్యాల

జగిత్యాల టౌన్, మార్చి 4: కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యువ పార్లమెంట్ నోడల్ జిల్లాగా జగిత్యాలను, జిల్లా నోడల్ కేంద్రంగా ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా నోడల్ పరిధిలోకి నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు వస్తాయని, ఆయా జిల్లాల్లోని విద్యార్థులు, యువకులు మై భారత్ పోర్టల్‌లో ఈనెల 9వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నోడల్ జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామని, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయికి పార్లమెంట్‌కు పంపిస్తామని తెలిపారు. వివరాలకు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, కందుకూరి శ్రీనివాస్, జిల్లా యువజన అధికారి రాంబాబును సంప్రదించాలని పేర్కొన్నారు. అలాగే, 94906 83621, 91776 56166లను సంప్రదించాలని సూచించారు.

## అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

సారంగాపూర్, మార్చి 4: బీర్పూర్ మండలం నర్సింహులపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ సందర్శించారు. ప్రీస్కూల్ పిల్లల వివరాల నమోదును పరిశీలించారు. ప్రైమరీ విద్య ఆవశ్యకతను వివరించారు. ఆన్‌లైన్ హాజరు ప్రకారం పిల్లలు ఉండాలని టీచర్లకు సూచించారు. పిల్లల బరువు ప్రతి నెల తప్పనిసరిగా తీసుకొని, వారి పోషణ స్థితిని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా బోధన ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలని ఆదేశించారు. సీడీపీవో వాణిశ్రీ, సూపర్‌వైజర్లు శైలజ, నీలిమ, కుసుమ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## మంచి ఫలితాలు సాధించాలి

సారంగాపూర్, మార్చి 4: ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొండ్ర రాంచందర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాలో మంగళవారం ఆయన ఇంటర్ విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, సత్యం రెడ్డి, బేర మహేశ్, శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అటవీ అధికారులకు నెమలి అప్పగింత

కొడిమ్యాల, మార్చి 4: నల్లగొండ గ్రామానికి చెందిన మొగిలి పెద్ద నర్సయ్య పొలం వద్ద మంగళవారం నెమలి పడి ఉన్నది. గమనించిన నర్సయ్య అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా బేస్ క్యాంపు సిబ్బంది వచ్చి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అందించి అటవీలో వదిలిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

## పంటల సాగుపై రైతులకు అవగాహన

కొడిమ్యాల, మార్చి 4: మండలంలోని పూడూర్ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల సాగు, పశుపోషణపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో పర్లపల్లి జ్యోతి, ఏఈవోలు రాజేశ్, శ్రీలత, గ్రీష్మ పాల్గొన్నారు.

## క్షయ నివారణ టీకాపై అవగాహన

కొడిమ్యాల, మార్చి 4: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ నివారణ టీకాపై మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అలాగే, పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు పరమేశ్వరి, నరేశ్, సీహెచ్‌వో రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి

కోరుట్ల, మార్చి 4: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆరోగ్యానికి హాని చేసే జంక్‌ఫుడ్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రావు, అధ్యాపకులు చంద నాగరాజు, చావ్లా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స

కోరుట్ల, మార్చి 4: పట్టణంలోని రెనే దవాఖానలో మంగళవారం యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన నర్సాగౌడ్‌కు మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు దవాఖాన నిర్వాహకుడు డాక్టర్ బంగారు స్వామి తెలిపారు. మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించడంపై ఐఎంఏ స్టేట్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ అనూప్‌రావు, పట్టణాధ్యక్షుడు డాక్టర్ రేగొండ రాజేశ్, కార్యదర్శి కేశవ అన్వేష్, కోశాధికారి జగదీశ్ హర్షం వ్యక్తం చేశారు.

## వేతనాలు చెల్లించాలి

జగిత్యాల, మార్చి 4: గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాల చెల్లింపు, ఇతర సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా పంచాయతీ అధికారికి మంగళవారం సీఐటీయూ (తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్) నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి ఒకటి నుంచి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఎస్టీవో ట్రెజరీలో నిలిచిపోయిన బకాయి వేతనాలు విడుదల చేయాలని, పంచాయతీల బ్యాంక్ ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఒక పూట పని చేయించాలని కోరారు. ఈ విషయాలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెవెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పులి మల్లేశం, సాతాళ్ల రాజేందర్,బేర సంతోష్ పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లపై దృష్టిసారించాలి



మున్సిపల్ అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

మారుతీనగర్, మార్చి 4: పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టిసారించాలని అదనపు కలెక్టర్, ప్రత్యేకాధికారి బీఎస్ లత సూచించారు. మెట్‌పల్లి పట్టణ పరిధిలోని వెంకట్రావుపేటలో మున్సిపల్ అధికారులు పన్నులు వసూలు చేస్తున్న తీరును మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌తో పాటు ఎల్ఆర్ఎస్ అప్లికేషన్స్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. సకాలంలో పన్నులు చెల్లించే విధంగా యజమానులకు రాయితీ గురించి తెలియజేయాలన్నారు. ప్రజలు సకాలంలో పన్నులను చెల్లించి మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, టీపీవో రాజేంద్రప్రసాద్, ఆర్ఐ మీర్జాఅజ్మతుల్లాబేగ్, టీపీఎస్ అశోక్, ఆర్ఐ అక్షయ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పశువుల పాకల నిర్మాణాలు పూర్తి చేయాలి

ధర్మపురి, మార్చి 4: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పశువుల పాకల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని డీఆర్డీవో రఘువరన్ లబ్ధిదారులకు సూచించారు. బుగ్గారం, చందయ్యపల్లి గ్రామాల్లో చేపడుతున్న పశువుల పాకల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ, అవసరమైతే కూలీలను పెంచి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట అధికారులు, తదితరులున్నారు.

## కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం

పెగడపల్లి, మార్చి 4: పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో భూగర్భ జలాల పెంపు కోసం రూఫ్ వాటర్ కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో అనిల్ కుమార్ తెలిపారు. మండల పరిషత్, తహసీల్ కార్యాలయాలపైన పడే వర్షపు నీరంతా ఇంకుడు గుంతల్లోకి వచ్చేలా వీటి నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఒక్కో ఇంకుడు గుంత రూ.35 వేలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు.

## ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్, మార్చి 4: పట్టణ ప్రజలు ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎల్ఆర్ఎస్ కింద 2020లో రూ.1000 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులకు, అక్రమ లే-అవుట్లలోని ఖాళీ ప్లాట్లకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 31 వరకు 25 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో లేదా కాల్ సెంటర్ నంబర్ 94934 71494లో సంప్రదించాలని కోరారు.

## రంజాన్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మల్లాపూర్, మార్చి 4: గ్రామాల్లో రంజాన్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రాజు సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ముస్లిం, హిందూ సంఘాల నాయకులతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## విద్యార్థులకు ఎల్ఈడీ బల్బుల తయారీపై శిక్షణ

కోరుట్ల, మార్చి 4: పట్టణంలోని కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు తెలంగాణ ఇన్నోవేటర్ సెన్సార్ మల్లేశం ఆధ్వర్యంలో ఎల్ఈడీ బల్బుల తయారీపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. 300 మంది విద్యార్థులు పాల్గొని 500 ఎల్ఈడీ బల్బులు తయారు చేసినట్లు కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో నిందితుడి అరెస్టు

కోరుట్ల, మార్చి 4: ఫోక్సో కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిపై జగిత్యాల ఫోక్సో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోరుట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన పిట్టల శ్రీధర్ ఫోక్సో కేసులో నిందితుడిగా ఉన్నాడు. కొద్ది రోజులుగా కోర్టులో హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఫోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడిపై నాన్ బెయిలెబుల్ వారెంట్ జారీ చేశారు. మంగళవారం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాలతో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

జగిత్యాల, మార్చి 4: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు స్కానింగ్ సెంటర్లను ప్రోగ్రాం ఆఫీసర్, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి మంగళవారం తనిఖీలు చేపట్టారు. సెంటర్లలో రికార్డులు, స్కానింగ్ యంత్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డేకాయ్ ఆపరేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ సాయి సుధ, సఖీ కోఆర్డినేటర్ లావణ్య, అశ్విని, హెల్త్ ఎడ్యుకేటర్లు భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణాధికారి రాజేశం, ఆరోగ్య పర్యవేక్షకుడు శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాయికల్, మార్చి 4: పట్టణంలోని గ్రీన్ వుడ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో దశాబ్ది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, కరస్పాండెంట్ మహేశ్ రెడ్డి, యజ్ఞశ్రీ, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అనిత, హెచ్ఎం రాజేశ్, ఎంఈవో శ్రీపతి రావు, మండల పరిషత్ అధికారి సుష్మా, వైద్యాధికారి శశికాంత్ రెడ్డి, పద్మయ్య, దేవదాసు, వాసర రవి, కడకుంట్ల జగదీశ్వర్, మచ్చ శేఖర్, గంగాధర్, సురేశ్ పాల్గొన్నారు.

## నువ్వు సాగుపై రైతులకు అవగాహన

జగిత్యాల టౌన్, మార్చి 4: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం దత్తత గ్రామం అల్లీపూర్‌లో నువ్వు సాగుపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పొలాస పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మజ, డాక్టర్ ఎన్ బలరాం, వై స్వాతి, డాక్టర్ డీఏ రజినీదేవి, ఏఈవో సుమలత, ఎఫ్‌పీవో శంకర్, రైతులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో వీడ్కోలు హంగామా

మల్లాపూర్, మార్చి 4: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భూమేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

కొడిమ్యాల, మార్చి 4: మండలంలోని గౌరాపూర్ గ్రామంలో మంగళవారం ఎనిమిది మంది పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 16,950 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

కోరుట్ల రూరల్, మార్చి 4: మండలంలోని సర్వరాజ్‌పూర్‌లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించారు. ఉపాధి పనులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ వంద మంది కూలీలు పనికి వచ్చేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. కార్యదర్శి మాధవి, ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మెట్‌పల్లి రూరల్, మార్చి 4: మల్లాపూర్ మండలం సాతారం నుంచి ట్రాక్టర్‌లో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా మెట్‌పల్లి పట్టణ శివారులో టాస్క్‌ఫోర్స్ టీమ్ పట్టుకున్నట్లు ఆర్ఐ ఉమేశ్ తెలిపారు. ఇసుక అక్రమంగా రవాణా చేసే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గౌడ సంఘం కార్యవర్గం

వెల్గటూర్, మార్చి 4: వెల్గటూర్‌లో గీతా పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడిగా మొత్కూరి శేఖర్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా బందెల నరేశ్, మెరుగు అశోక్, బందెల రాజయ్య, సింగం లక్ష్మీనారాయణ, బందెల పెద్ద నర్సయ్య, రంగు చిన్నయ్య ఎన్నికయ్యారు.

## మద్యం మత్తులో ఇరువర్గాల ఘర్షణ

కోరుట్ల, మార్చి 4: పట్టణంలోని నంది చౌరస్తా వద్ద మద్యం మత్తులో ఉన్న ఇరువర్గాలు ఘర్షణకు దిగిన ఘటన మంగళవారం జరిగింది. స్థానిక అల్లమయ్య గుట్ట కాలనీకి చెందిన కొంతమంది నంది చౌరస్తా వద్ద గల పర్మిట్ రూమ్‌లో మద్యం సేవిస్తున్నారు. ఈక్రమంలో గతంలో వీరితో పాత కక్షలు ఉన్న మరో వర్గం వ్యక్తులు గమనించి గొడవకు దిగారు. దీంతో రహదారిపై ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించి పంపించారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

CHANGE OF NAME
I, KANKUNTLA NARESH MALLAIAH S/o. KANKUNTLA MALLAIAH (Old Name) H.No. 2-98 Village: Vegurupalle, Mandal Manakondoor, Dist:Karimnagar Telangana. My Name Was Change to KANKUNTLA NARESH S/o. KANKUNTLA MALLAIAH (New Name)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189